లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్ట ప్రకారం కఠిన శిక్షకు గురికాక తప్పదని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి టి.వి బాలమురళీకృష్ణ హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపులపై పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్.సి.డి ప్రోగ్రామం అధికారి వెంకటరావు మాట్లాడుతూ పిల్లలపై అనుచిత ప్రవర్తన కలిగి ఉన్న వారిని గుర్తించడం అందరి బాధ్యత అన్నారు. పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రస్థాయి ట్రైనర్ ఎస్.ఉదయ్ కుమార్, సైకాలజిస్ట్ రాజకుమార్ లైంగిక వేధింపులకు గురికాకుండా పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఆధునికీకరణపై నీలినీడలు

- పదేళ్లుగా పెండింగ్‌లో వంశధార మోడరనైజేషన్ ప్రతిపాదనలు
- పనులు జరగక శివారుకు అందని సాగునీరు
- జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ టిడిపి నేతల ప్రకటనలు
- బడ్జెట్‌లో నిధులు కేటాయించని ప్రభుత్వం

జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న వంశధార ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొంది. సుమారు నాలుగున్నర దశాబ్దాల కిందటి నిర్మించిన కుడి, ఎడమ కాలువలు దయనీయంగా మారడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కాలువల ఆధునికీకరణ కోసం పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. టిడిపి అధికారంలో ఉండగా రెండు, మూడు పర్యాయాలు నివేదించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన రెండుసార్లు పంపినా, ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో కాలువ గట్లు బలహీనంగా మారి బ్యారేజీలో నీళ్లున్నా, పూర్తిస్థాయిలో నీరు విడిచిపెట్టలేని పరిస్థితి తలెత్తుతోంది. జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు వచ్చిన ప్రతిసారీ చెప్తున్నా, బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించకపోవడంతో ఆధునికీకరణపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టును హిరమండలం వద్ద 1970లో స్టేజ్-1 కింద గొట్టాబ్యారేజి నిర్మాణంతో పాటు కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. కాలువల్లోకి 1977 నుంచి నీటిని విడిచిపెట్టడం మొదలుపెట్టారు. అప్పట్నుంచి కాలువలు ఆధునికీకరణకు నోచుకోలేదు. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంతో, అంతకుమించి నీటిని వదిలితే గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ఏటా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది.

సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం వద్ద వంశధార కాలువపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

పెరుగుతున్న అంచనా వ్యయం

ఎడమ కాలువను ఆధునీరించాల్సిన అవసరముందంటూ గత పదేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి తర్వాత మొదటిసారి 2016లో రూ.456 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత చివరిసారిగా 2018లో రూ.624 కోట్లతో పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో మొదటిసారి పంపారు. 2021 మార్చిలో రూ.776 కోట్లతో, 2023 నవంబరులో రూ.954 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం అంచనా వ్యయం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత 2022-23లో రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆమోదం లభించలేదు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. 2023 అక్టోబరులో వంశధారలో 80 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపుల గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. హిరమండలం అక్కరాపల్లి 2022 జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దాన్నీ రూ.ఐదు లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద బైఠాయించిన విఓఎలు

డిఆర్‌డిఎ పీడీని సస్పెన్షన్ చేయాలి

- వెలుగు విఓఎలకు క్షమాపణలు చెప్పాలి
- సిఐటియు నాయకుల డిమాండ్
- డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద విఓఎల ధర్నా
- మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తాం : పీడీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెలుగు విఓఎలపై అనుచితంగా, అవమానకరంగా మాట్లాడిన డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ క్షమాపణలు చెప్పాలని, ఆయన్ను తక్షణమే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద విఓఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన విఓఎలు గురువారం ధర్నా చేపట్టారు. పీడీ ధర్నా వద్దకు వచ్చి క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విఓఎ ఉద్యోగులు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ధనలక్ష్మి, జి.అసిరినాయుడుతో కలిసి వారు మాట్లాడుతూ విఓఎలుగా 90 శాతం మంది మహిళలే పనిచేస్తున్నారని చెప్పారు. వారిని కించపరుస్తూ పీడీ మాట్లాడడం బాధాకరమన్నారు. అతి తక్కువ వేతనంతో విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో విఓఎలు కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పటికే వెలుగు ఎపిఎంలు, సిసిలు విఓఎలపై దురుసుగా వ్యవహరిస్తున్నారని, జిల్లా అధికారే ఇలా మాట్లాడితే మండలస్థాయి అధికారులు ఇంకా దురుసుగా వ్యవహరిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నా వద్దకు పీడీ వచ్చి క్షమాపణ చెప్పే వరకు కదిలేది లేదని మండుటెండలోనే బైఠాయించారు.

మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తాం

ఒకటో పట్టణ సిఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ పీడీ వద్దకు వెళ్లి విషయాన్ని వివరించారు. యూనియన్ నాయకులతో చర్చలకు ఏర్పాటు చేశారు. చర్చల్లోనూ అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోవడంతో విఓఎలు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని పీడీపై చర్యలు తీసుకోవాలని, విఓఎలకు న్యాయం చేయాలని అక్కడ బైఠాయించారు. ఉన్నతాధికారుల జోక్యంతో దిగొచ్చిన పీడీ కిరణ్‌కుమార్ తిరిగి యూనియన్ నాయకులతో చర్చలు జరిపి భవిష్యత్‌లో ఈవిధంగా వ్యవహరించనని, విఓఎలను గౌరవిస్తానని, వారితో ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, ఎపిఎంలు, సిసిలు కూడా మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఆదేశాలిస్తానని హామీనిచ్చారు. దీంతో విఓఎలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, అల్లు సత్యన్నారాయణ, వెలుగు విఓఎల సంఘం నాయకులు మురళి, ఎన్.శశిభూషణరావు, ద్రౌపది, డి.జోగారావు, ఎన్.రాజేశ్వరి, బి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అభ్యంతకరం కాని ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబరు 15వ తేదీ నాటికి ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం రెగ్యులరైజేషన్ స్కీమ్‌ను ప్రకటించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఆక్రమణల క్రమబద్ధీకరణకు గానూ ఈనెల 7వ తేదీ నుంచి మీసేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపట్నుంచి పి-4 సర్వే

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) సర్వేకు కార్యాచరణ రూపొందించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌తో ఈనెల 8వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే ప్రారంభించి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ సర్వేపై ఈనెల 6, 7 తేదీల్లో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలు తమ సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పి-4 విధానం ముఖ్య ఉద్దేశమని వివరించారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం కుటుంబాలు అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపబోదని స్పష్టం చేశారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా కుటుంబ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించవచ్చని తెలిపారు. ఈ సర్వేపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించి అన్ని శాఖల సమన్వయ, సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులపై నిర్లక్ష్యం

- 27న విసి, ఎమ్‌డి కార్యాలయాల వద్ద మహా ప్రదర్శన
- ఆర్ఆర్ఇఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని ఎన్నిస్లార్లు కోరినా పట్టించుకోవడం లేదని ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధరరావు విమర్శించారు. నగరంలోని సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని, అందులో భాగంగా ఈనెల 27న విజయవాడలోని ఆర్‌టిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట మహా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2020 జనవరి 1న ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు లీవ్ ఎన్ కాష్‌మెంటు ఆర్‌టిసి యాజమాన్యం చెల్లించలేదని, ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1996 నుంచి 2014 వరకు హయ్యర్ పెన్షన్ కోసం ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. శాశ్వత డిజిటల్ కార్డులు ఇవ్వాలని, సూపర్ లగ్జరీ ఉచిత ప్రయాణం భార్యా భర్తలకు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సామాజిక పెన్షన్ రిటైర్డు ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.కోటేశ్వరరావు, కోశాధికారి రాజారావు, జిల్లా కార్యదర్శి పి.వాసుదేవరావు, సిఐటియు నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంగాధరరావు

మాట్లాడుతున్న డిపిఒ భారతీ సౌజన్య

సమర్థవంతంగా ఘన వ్యర్థాల నిర్వహణ

ప్రజాశక్తి - లావేరు

ఘన వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య అన్నారు. మండల కేంద్రం లావేరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం, పొందూరు మండలాలకు చెందిన పంచాయతీ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణపై గురువారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మరింత తర్ఫీదు పొంది సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనిలో ఎంత పురోగతి సాధించామన్నదే ప్రధానమన్నారు. డిపిఆర్‌సిలు రాజేష్, కన్నబాబు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఇఒపిడిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కవిటి : వివరాలను వెల్లడిస్తున్న డిఎస్ పి వెంకట అప్పారావు

గంజాయితో ఇద్దరు అరెస్టు

11.79 కేజీలు స్వాధీనం

ప్రజాశక్తి - కవిటి, ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని కవిటి, ఇచ్ఛాపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 11.79 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు కవిటి, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్లలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో వివరించారు. ఒడిశాలోని లాఠీ గ్రామానికి చెందిన సురేష్ నాయక్ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ విషయమై తన చిన్ననాటి స్నేహితుడైన రాజేంద్ర బాదిత్యను సంప్రదించాడు. దీంతో బెంగళూరులో ఉన్న తాను చెప్పిన మనిషికి గంజాయి అందిస్తే కేజీకి రూ.వెయ్యి చొప్పున ఒప్పందం చేసుకున్నాడు. అందులో భాగంగా గురువారం ఒడిశా నుంచి గంజాయితో బయలుదేరిన సురేష్ నాయక్ బస్సులో కంచిలి వెళ్లి అక్కడ నుంచి రైలు ద్వారా తన గమ్యాన్ని చేరుకోవాలనుకున్నాడు. కారాపాడు టోల్‌గేట్ వద్ద బస్సు దిగి కంచిలి వెళ్లేందుకు కొజ్జిరియా జంక్షన్ వద్ద వేచిచూస్తున్నాడు. దీనిపై ముందస్తు సమాచారం అందుకున్న కవిటి పోలీసులు కొజ్జిరియా జంక్షన్ వద్ద సురేష్ నాయక్‌ను పట్టుకుని 10.250 కేజీల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెంకు చెందిన కొర్లపాటి వంశీని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వంశీ ఒడిశాలో ఇదివరకు గంజాయి అమ్మిన వ్యక్తి వద్ద నుంచి 1.540 గంజాయిని కొని, ఇబ్రహీంపట్నం తీసుకెళ్లడానికి బస్సులో ఇచ్ఛాపురం వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కడానికి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల వైపు ఆకర్షితులవుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో సిఐ చిన్నంనాయుడు, ఎస్ఐలు వి.రవివర్మ, ముకుందరావు, ఎఎస్ఐ కుర్మారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం గ్యాస్ ఏజెన్సీకే నిర్వహణా బాధ్యతలు

జెసి ఆదేశాలతో పున: విచారణ

ప్రజాశక్తి - పొందూరు

బిల్లు కంటే అదనపు వసూళ్ల ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్న పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహణా బాధ్యతలను అధికారులు తిరిగి రణస్థలం గ్యాస్ ఏజెన్సీకే అప్పగించారు. అదనపు వసూళ్లపై కలెక్టర్‌కు మహిళల ఫిర్యాదుతో మూడు రోజులు విచారణ చేసిన డిఎస్ఒ జి.సూర్యప్రకాష్, తహశీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు ఇచ్చిన నివేదికతో రెండు రోజుల కిందట గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ, డెలివరీ బాధ్యతలను రణస్థలం ఏజెన్సీకి అధికారులు అప్పగించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ విచారణ చేసి ఒక్కరోజులోనే తిరిగి పాత ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. ఆరోపణలు వాస్తవమని తేలినా పాత ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమగ్ర విచారణ చేపట్టాలని జెసి ఆదేశించడంతో, గురువారం ఉదయం నుంచి డిఎస్ఒ, తహశీల్దార్ స్టాక్ వివరాలపై విచారణ చేసి తేడాలు నిర్ధారించారు. జెసి ఆదేశాల మేరకు గ్యాస్ డెలివరీ, ఏజెన్సీ నిర్వహణా బాధ్యతలు రణస్థలం ఏజెన్సీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యకలాపాల నిర్వహణ తక్షణమే ప్రారంభించాలని, గ్యాస్ డెలివరీ విషయంలో వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.



స్టాకు రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన కల్లుగీత కార్మికుల్లోని ఉప కులాలకు 18 మద్యం దుకాణాలను కేటాయించారు. గీత కార్మికులకు షాపుల కేటాయింపు ప్రక్రియను నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళావేదికలో గురువారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ లాటరీ తీశారు. ఈ ప్రక్రియను పూర్తిగా వీడియోగ్రఫీ ద్వారా చిత్రీకరించారు. జిల్లాలోని 18 షాపులకు మొత్తం 204 దరఖాస్తులు రాగా, లాటరీ ద్వారా శ్రీశయనకు చెందిన పది మందికి, సెగిడికి చెందిన నలుగురికి, గౌడ, యాతకు ఒక్కొక్కటి చొప్పున, సొండికి చెందిన ఇద్దరికి లాటరీ ద్వారా షాపులు కేటాయించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, కులం, స్థానికత, ఉప కులాన్ని నిర్ధారించే ధ్రువీకరణ పత్రాలు సమర్పించడంతో పాటు నిర్దేశించిన మొత్తాన్ని ఈనెల ఏడో తేదీ నాటికి చెల్లించిన వారికే షాపులు కేటాయిస్తామని తెలిపారు. ఒకవేళ ఎవరైనా అనర్హతకు గురైతే మొదటి ప్రాధాన్యతలో వచ్చిన తర్వాతి వ్యక్తికి షాపులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి నాయుడు, ఇతర ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 158/2025 in O.S.48/2024

Between:- దున్న బాబ్జి .....వాది
And:
పొరపల్లి రాణి (3వ ప్రతివాది) .....ప్రతివాది

To,
పొరపల్లి రాణి, W/o అశోక్, D/o Late నాగరాజు, వయస్సు: 23 సంllలు, R/o రాంభజన వీధి, పొందూరు గ్రామం మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు దావాలో వాది చనిపోయిన మీనాన్నగారైన అల్లంశెట్టి నాగరాజు వారసురాలివి అయినందున మీ పై దావా వేసియున్నారు. పై దావాలో మిమ్ములను 3వ ప్రతివాదిగా చేర్చడమైనది. మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **తేది 27-03-2025న ఉll గంll10.30 నిll లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేని ఎడల మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి మీ పరోక్షమునందు వాదికి అవసరమగు ఆర్డర్‌ను జారీచేయడమగు యందు మూలముగా మీకు తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)

కె. రమణమూర్తి, సెల్: 9949282812
బి. మంజుల, సెల్: 9949282812
వాదితరపు న్యాయవాదులు, పొందూరు.

శ్రీయుత గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ కల్వకుర్తి, నాగర్ కర్నూల్ జిల్లా
STCNI. 17 /24

Between:-
Enjamuri Venkatesh ...Complainant
And
Sanamoni Sanath ..... Accused

Accused కి కోర్టు సమన్లు STC.NI. No.17/2024లో నిందితులుగా ఉన్న, Sanamoni Sanath S/oRama SankaraRao age39.year Occ... Business H.No.2-2-22/3, Womens Collage Road , Srikakulam district.Ap. cell : 9346469198, 8498960036. మీ పై Complainant గా ఉన్న Enjamuri Venkatesh S/o E.Bheemaiah age 29 years occ; Business R/o H.No.1-4.Thurkalapally Village of Charkonda mandal, Nagar kurnool, District. T.S గారు JFCM/JCJ కల్వకుర్తి కోర్టులో, Cheque bounce case U/S 138 and 142 Ni act క్రింద మీపై ఈ case వేసినారు కానీ మీరు కోర్టుకు సమన్లు/నోటీసులు ఉద్దేశ పూర్వకంగా తీసు కోకుండా తప్పించు కొనుచున్నారు. ఈ ప్రకటన కోర్టు నుండి పబ్లికేషన్ కొరకు అనుమతి పొంది ఇట్టి నోటీసు పేపర్ ద్వారా పై కేసు తేదీ 26.3.2025 రోజు మీరు కోర్టుకు హాజరు కాగలరు. ఆ రోజు మీరు కానీ మీ వకీలు ద్వారా కానీ కోర్టుకు హాజరు కాగలరు .మీరు కోర్టు హాజరు కానియెడల ఏకపక్షంగా తీర్మానించబడును. దీనికి వారు బాధ్యులు కారు

//కోర్టు వారి ఆదేశాల మేరకు//

Mohd.Jameel Ahmed.
Advocate
Kalwakuthy,
Nagarkurnool.Dist.
Cell.No.9440873749

గ్రామపంచాయితీ కార్యాలయం - పొందూరు

రేఖా నెం : 27/2025, **టెండరు ప్రకటన** తే.05.03.2025 ది.

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, పొందూరు గ్రామ పంచాయతి నకు సంబంధించి షెడ్యులు నందు తెల్పిన పనులను 2025 2026 సం. నందు అనగా **తే:01-04-2025ది నుండి తే:31-03-2026ది వరకు** కాంట్రాక్టు పద్దతి పై నెల ఒక్కింటికి చొప్పున ప్రతి ఫలం కోరుతూ సదరు పనులను నిర్వహించుటకు మరియు షెడ్యులు నందు తెల్పిన సామాగ్రిని 2025-2026 సం. నందు సప్లై చేయుటకు గాను తే:12-03-2025ది ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.01-00 వరకు ఈ గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. టెండర్ దారులు టెండర్ ధరావత్తు చెల్లించి, టెండర్ షరతులకు లోబడి మాత్రమే టెండర్లలో పాల్గొనవలెను. స్వీకరించబడిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం గం 02-00 లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును.

టెండర్ల ను ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిదా వేయుటకు గాని, తిరస్కరించుటకు గాని పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతీ నకు మరియు అందులకు సంబందించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు మరియు టెండర్ షెడ్యూల్ వివరముల కొరకు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను.

సం//- కె. మోహన్ బాబు
కార్యనిర్వహణాధికారి (పంచాయతి కార్యదర్శి), గ్రామ పంచాయతి పొందూరు.

చివరి దశకు గోకార్టింగ్ పోటీలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీలకు అవసరమైన ప్రాథమిక పరీక్షలను సంబంధిత నిపుణులు గురువారం నిర్వహించి ఈనెల 7న జరగబోవు చివరి పోటీలకు సర్వం సిద్ధం చేశామని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. తమిళనాడు, తెలంగాణా, ఒడిశా, ఎపి నుండి 16 గోకార్టింగ్ బృందాలు హాజరయ్యాయని వీటిలో ప్రధానంగా 'మానూవరబిలిటీ, బ్రేక్' పరీక్షలను చేపట్టారన్నారు. మానువరబిలిటీ ద్వారా నాజూకైన రహదారిపై తక్కువ స్థలంలో, తక్కువ సమయంలో గోకార్ట్ సులువుగా తిరగగలదా లేదా, అవసరమైన చోట డ్రైవర్ ప్రతిస్పందన ఎలా ఉంది అన్న అంశంపై విశ్లేషించడం తదితర అంశాలను నిపుణులు అద్యయనం చేశారన్నారు. ఉదయం పూట పెట్రోల్, ఎలక్ట్రికల్ వాహనాల మైలేజీ, స్పీడులను పరీక్షించారన్నారు. నిపుణులు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించిన అనంతరం మాత్రమే ఆఖరి (రేస్) అనుమతిస్తారని డైరెక్టర్ పేర్కొన్నారు. గోకార్టింగ్ కన్వీనర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో-కన్వీనర్లు డీన్ డాక్టర్ డి. శ్రీరాములు, ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ వి.అశోక్‌కుమార్, సిఎస్ఇ హెచ్ఒడి డాక్టర్ వై.రమేష్, ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘువీర్ దొంతి కురిటి, విద్యార్థి కన్వీనర్లు పి.ఉదయ్ కుమార్, బి. సాయి సాకేత్‌లు పోటీలకు అవసరమైన పర్యవేక్షణ చేస్తున్నారని డైరెక్టర్ తెలిపారు.

రవికుమార్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

'సుడా' అభివృద్ధికి సూచనలివ్వండి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సుడా పరిధిలో అభివృద్ధికి తోడ్పడేందుకు సూచనలు చేయాలని శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కొరికాన రవికుమార్ కోరారు. జిల్లా కోర్టు ఆవరణలో గురువారం ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదానంగా శ్రీకాకుళం నగర అభివృద్ధికి అనువైన పరిస్థితులను ప్రభుత్వం కల్పించేందుకు వీలుందన్నారు. పర్యాటక రంగాన్ని ఆకట్టుకునేలా కొన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, అందులో బాగంగా మేధావుల సూచనలు తీసుకునేందుకు వచ్చే నెలలో శ్రీకాకుళం కేంద్రంగా సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాన కృష్ణచంద్, వి.జగన్నాథ నాయుడు, కె.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పదోతరగతి పరీక్షలకు ఈ నెల 15న హాజరయ్యే విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సామాజిక, వ్యాపార వేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. కోటబొమ్మాళి, శ్రీకాకుళంలో వెయ్యి మంది విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు పరీక్ష సామగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది వంటిదన్నారు. ఇక్కడ ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చునని సూచించారు. ప్రతీఏటా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించడం జరుగుతుందన్నారు. శ్రీనివాసరావు చేస్తున్న సేవపై విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ఉన్నతంగా ఎదిగి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఎపిజెఎసి జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం ఆకాంక్షించారు. నగరంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో ఎపి జెఎసి మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని ఆటలు, పాటల పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ కలెక్టర్ అనుమతి మేరకు గురు, శుక్రవారాల్లో మహిళా ఉద్యోగులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు పోటీలు నిర్వహిస్తున్నామని, పోటీల నిర్వహణకు జిల్లా కలెక్టర్ రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. నిత్యం విధి నిర్వహణలో ఉండే ఉద్యోగినిలకు ఒత్తిడి నుంచి ఈ ఆటలు ఉపశమనం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపి ఫెన్షనర్స్ జెఎసి చైర్మన్ సిహెచ్ పురుషోత్తంనాయుడు, ఎపి జెఎసి కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షులు హైమావతి, కన్వీనర్ శ్రావణి, మమత బెహరా, లలిత, యశోద, పార్వతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి- అరసవల్లి

స్థానిక కలెక్టర్ బంగ్లా ఎస్‌పి కాలనీలో నివాసముంటున్న లోపింటి అప్పలరాజు, లావణ్యల కుమారుడు రితీష్‌కు, అదే వీధికి చెందిన ధవళ జనార్దన్, బొడ్డేపల్లి చాణిక్య అందించిన సహకారంతో శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతులమీదుగా చక్రాల కుర్చీ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్ వాట్సప్ స్టేటస్ ద్వారా సమాచారం అందుకుని చక్రాల కుర్చీ వితరణ చేపట్టడం జరిగిందన్నారు. ధవళ జనార్దన్, బొడ్డేపల్లి చాణిక్యల సహకారం గొప్పదని, ప్రతిఒక్కరూ ఇటువంటి సామాజిక ఆలోచనతో ముందుకు వచ్చి నిరుపేదలకు అండగా నిలవాలన్నారు. చిన్నారి పుట్టుకతో పోలియోతో బాధపడుతూ మంచానికే పరిమితమని, తండ్రి దినసరి కూలీకాగా, తల్లి చుట్టుపక్కల ఇళ్లల్లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. దాతలు ఏదో ఒక రకంగా ఈ కుటుంబానికి సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో దాతలు, బాధిత కుటుంబ సభ్యులతో పాటు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు చిన్మయరావు, మేనేజర్ జి.రమణ, నంది ఉమా శంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీని అందజేస్తున్న జగన్మోహనరావు తదితరులు

కోట్ల వ్యయం.. ఫలితం శూన్యం

కోట్లాది రూపాయలు వ్యయం చేశాం. సౌకర్యాలు కల్పించామని దంబికంగా ప్రకటనలు గుప్పిస్తున్న పాలకవర్గం, అవి ఎంతవరకు కార్యరూపం దాల్చాయో కనీసం పరిశీలన చేపట్టక పోవడం విడ్డూరంగా ఉంది. దీంతో ఆ గ్రామాలకు కష్టాలు తీరడం లేదు.

- **అర్ధాంతరంగా ఆగిన రహదారి పనులు**
- **చోద్యం చూస్తున్న అధికారులు**
- **గిరిజనులకు తప్పని అవస్థలు**

ప్రజాశక్తి- బూర్జ

ఆ గిరిజన గ్రామాల ప్రజలకు నడక కష్టాలు తప్పడం లేదు. దశాబ్దాల కాలంగా అను నిత్యం నడక యాతనతో సతమతమవుతున్నారు. దూరంగా కొండల మధ్యలో నివాసం ఉంటున్న తమకు రహదారి సౌకర్యం కరువైందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పాలకులు వచ్చిన సందర్భంలో తమకు రహదారి కావాలని పలుమార్లు విన్నవించుకోవడంతో, దీనిపై స్పందించిన గత వైసిపి ప్రభుత్వం పక్కా రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రూ.2 కోట్లు నిధులను మంజూరు చేసింది.

ఆర్భాటంగా శంకుస్థాపన

బూర్జ మండలం మదనాపురం, సరుబుజ్జిలి రోడ్డు నుంచి వయా మశానపుట్టి గ్రామ రహదారి నిర్మాణం కొరకు 2021లో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆర్భాటంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. నేటికి ఐదేళ్లు అవు తున్నప్పటికీ రహదారి నిర్మాణం పనులు అతీగతి లేకుండా పోయిందని గిరిజనులు బాహాటంగానే చెబు తున్నారు.

తప్పని అవస్థలు

బిటి రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గుత్తేదారు కేవలం రాళ్లు కుప్పలు మాత్రమే వేసి విడిచిపెట్టడంతో అర్ధాంతరంగా రహదారి పనులు నిలిచిపోయాయి. అయితే ఈ విషయంపై గుత్తేదారును సంప్రదిస్తే నాకేం సంబంధం లేదని, అధికారులకు అడగండని దాటవేస్తున్నాడని గిరిజనులు వాపోతున్నారు. అయితే ఈ రహదారికి సంబంధించిన బిల్లులు పూర్తిస్థాయిలో గుత్తేదారుకు చెల్లించడం జరిగిందని తెలుస్తుంది. మట్టి రోడ్డు అయినా సరే సౌకర్యంగా ఉండేదని కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు అన్న చందంగా రహదారి నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అత్యవసర సమయంలో ఎటువంటి వాహనాలు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని, కనీసం నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాళ్లు తేలిన మశానపుట్టి రహదారి

కూటమిలోనూ షరా మామూలే

కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోనైనా తమ రహదారి కష్టాలు తీరుతాయని ఎంతో ఆశగా ఎదురుచూసిన గిరిజనులకు నిరాశే ఎదురవుతుంది. రహదారి పూర్తి చేయాలని అటు పాలకవర్గంతో పాటు ఐటిడిఎ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జాడ లేని అధికారులు

ఇదే విషయంపై సంబంధిత ఆర్అండ్‌బి ఇఇ రమాదేవి, డిఇఇ సింహాచలంను వివరణ కొరకు ప్రజాశక్తి పలుమార్లు ఫోన్‌లో ప్రయత్నం చేయగా అధికారులు స్పందించక పోవడం విశేషం.

రహదారిని పూర్తి చేయాలి

గత ఐదేళ్లుగా రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారుల జాడలేదు. అత్యవసర సమయంలో అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- పాలక దమయంతి, జంగాలపాడు

చోద్యం చూస్తున్న అధికారులు

అర్ధాంతరంగా రహదారి పనులు నిలిపివేశారు. నేటికి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారు. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలి.

- ఆరిక ప్రసాదరావు, జంగాలపాడు

రికార్డుల్లో రైతుల పేర్లు తారుమారు

ప్రజాశక్తి- పలాస

రెవెన్యూ అధికారులు కొన్నిసార్లు చేసిన తప్పిదాలు రైతుల జాతకాలే మారిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. పట్టణ ప్రథమపౌరుడిగా ఉన్న బల్ల గిరిబాబు భూములు ఇటీవల జరిగిన రీసర్వేలో ఇతరుల రైతుల పేర్లు రికార్డుల్లో పొందుపరచడంతో పలాస పట్టణ పౌరుడి భూములకే రెవెన్యూ అధికారులు ఎసరు పెట్టినట్లవుతుంది. దీనిపై బల్ల గిరిబాబు విలేకరలకు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి పూర్తి స్థాయిలో దానికి సంబంధించిన పత్రాలు అందించారు. గిరిబాబు అందించిన వివరాల ప్రకారం గిరిబాబు తండ్రి బల్ల నరసింహామూర్తి వారసత్వంగా అయనకు, ఆయన సోదరులకు కొంత భూమి దఖలు పడ్డాయి. దీనికి రెవెన్యూ అధికారులకు ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముటేషన్‌కు బల్ల గిరిబాబు, వారి సోదరుడు ధరఖాస్తు చేసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం రెవెన్యూ గ్రామంలో సర్వే నెం25/3లో గిరిబాబు సోదరులకు 64 సెంట్లు భూమి ఉండగా ఈ సర్వే నంబరుకు సంబంధించి మీకు భూమి లేదని రికార్డులు అడంగల్లో పూర్తి విస్తీర్ణంకు బదులు 0 చూపిస్తున్నందున తాము ఈ సర్వే నంబరుకు ముటేషన్ చేయటకు

మాట్లాడుతున్న గిరిబాబు

వీలుపడదని ఈ సర్వే నంబర్‌లో బలరాందేవ్ తండ్రి కృష్ణచంద్రదేవ్ స్వాదీన ఆదీనంలో ఉన్నట్లు గుర్తించామని విఆర్ఒ, సర్వేయర్ సంతకాలతో కూడిన నివేదిక అందించడంతో ప్రథమపౌరుడు ఈ వివరాలు చూసి కంగుతిని, రెవెన్యూ అధికారులపై తీవ్ర అగ్రహానికి గురయ్యారు. అదే విధంగా ఇదే రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 42లో 96 సెంట్లు తమ తండ్రి వారసత్వ హక్కుగా తమ సోదరులకు భూమి ఉండగా దీనిని 22ఎ లో ఉందని అధికారులు దానికి సంబంధించిన అడంగల్, ఇతర పత్రాలు తాము ఎన్నిసార్లు ధరఖాస్తు చేసినా ఇవ్వడం లేదని, ప్రభుత్వం 22ఎ లో ఉన్న స్థలాలను 22ఎ తొలిగించి దానిని రైతుల పేరుపై సరిదిద్దాలని ప్రకటించినప్పటికీ ఇక్కడ రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదని మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సర్వే నంబర్ 63లో 8 ఎకరాల 4 సెంట్లు పురోహిత్ ఇనామ్ భూములు ఉండగా వాటిలో ఆరుగురు రెతులతో పాటు తమకు 1.40 ఎకరాలు భూమి ఉండగా ఆరుగురు రైతులకు రెగ్యులర్ ఖాతా నెంబర్ పాటు 1 బి అడంగల్ కూడా వస్తుండగా తన పేరున ఉన్న భూమికి సంబంధించి నోషనల్ ఖాతాలో చేర్చి తనకు 1 బి, అడంగల్ రాకుండా రెవెన్యూ అధికారులు తమ భూములపై రికార్డుల్లో తారుమారు చేసి తమతో చెలగాటం అడుతున్నారని ఆరోపించారు. ప్రథమపౌరుడిగా ఉన్న తమ భూములకే రికార్డులలో రక్షణ లేకపోతే మిగిలిన సామాన్య రైతులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రికార్డు తారుమారు చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, తమ భూములు అన్ని తన స్వాదీన హక్కులో ఉన్న నేపథ్యంలో రికార్డుల్లో ఆయా సర్వే నెంబర్‌లో తమ సోదరులు పేర్లు చేర్చాలని ఆర్‌డిఒకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా సిఎం పేసికు కూడా ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. తమకు సరైన న్యాయం జరగకపోతే పలాస రెవెన్యూ కార్యాలయం ఎదుటనే అమరణ నిరాహారదీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ విషయంపై రెవెన్యూ కార్యాలయ సర్వేయర్ వద్ద వివరణ కోరగా ఎక్కడో చిన్నపాటి తప్పిదం జరిగి ఉంటుందని దీనిని సరిచేస్తామని తెలిపారు.

కందకాల పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ తిరుమలరావు

ఉపాధి పనులు పరిశీలన

కంచిలి: మండలంలోని జలంత్ర కోట పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను స్థానిక ఎంపిడిఒ వి.తిరుమలరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సమీప తోటల్లో చేపడుతున్న కందకాల తవ్వకం పనులు పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ పనులకు సంబంధించి సూచనలు అందజేశారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచన చేశారు. కార్యక్రమంలో ఎపిఒ ధనుంజయ, టెక్నికల్ అసిస్టెంట్ బి.వంశీ, ఫీల్డ్ అసిస్టెంట్ బి.లోకేష్ పాల్గొన్నారు.

పోలీసుల పనితీరును వివరిస్తున్న ఎస్ఐ లవరాజు

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

సోంపేట: జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని సంస్కార భారతి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు గురువారం పోలీస్ విధులపై అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ లవరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసుల పనితీరు, స్టేషన్‌లో వివిధ విభాగాలపై తెలియజేశారు. అలాగే మహిళా రక్షణ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్ఎ-4 పరీక్షలు

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎ-4 పరీక్షలు గురువారంతో ముగిశాయి. మూడు రోజుల క్రితం ప్రారంభమైన పరీక్షలు నేటితో ముగిశాయి. మండల విద్యాశాఖా కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాలు పంపిణీ జరిగాయి. పూటకు రెండుపరీక్షలు చొప్పున నిర్వహించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఎచ్చెర్ల: ఎ.పి.గురుకుల విద్యాలయాల సంస్థచే నిర్వహిస్తున్న ఎపిఆర్‌సిఎటికు ఎచ్చెర్ల మండలంలోని ఎస్.ఎం.పురం నందు ఎపి గురుకుల పాఠశాల బాలురు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో 80 సీట్లు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లు ప్రవేశాలకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఈనెల 31 వరకు https:// aprs. cfss. in వెబ్సైట్ ద్వారా చేసుకోవచ్చున్నారు. అన్ని తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8712625021 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

సోంపేట: బారువకు చెందిన తెలుగల శ్రీకాంత్ అనే ఆర్మీ జవాన్ ఇటీవల బారువ కంభ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ బి.రమేష్ రూ.50 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో బారువ ఎక్స్ సర్వీస్‌మేన్ అసోసియేషన్ అధ్యక్షుడు బిఎస్ నాయుడు, సభ్యులు ఎంఎన్ రావు, సంపత్ సాహు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు పిఎంహెచ్‌వై వర్తింపజేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులకు ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన పథకాన్ని వర్తింప జేయాలని, మందుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని ఆంధ్రా ఫెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ సిహెచ్ పురుషోత్తం నాయుడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. విశాఖలో ఆమెను కలిసి రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. మూడున్నర దశాబ్దాల పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, ప్రజలకు అందించి, విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు లెక్క చేయకుండా పనిచేశామని గుర్తు చేశారు. ప్రభుత్వోద్యోగులు రిటైర్ అయిన తర్వాత ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నారని ఆమెకు వివరించారు.

నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సీనియర్ సిటిజన్ల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన స్కీం వర్తింప జేయడం వల్ల గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకూ ఉచితంగా వైద్యం పొందడానికి వీలుంటుందని ఆమెకు వివరించారు. రాష్ట్ర పెన్షనర్ల జెఎసి నాయకులు తూము నాగభూషణం, జి.సతీష్ కుమార్. తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న యుగంధర్

మెడికల్ మాఫియాగా శ్రీకాకుళం

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాలు మెడికల్ మాఫియాగా మారాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కొన్న శ్రీనివాసరావులు అన్నారు. గురువారం నరసన్నపేట కేంద్రంలో ప్రైవేట్ కళాశాలలో విలేకరుతో మాట్లాడారు. జిల్లాలో ఆర్ఎంపి నుంచి ఎండి డాక్టర్ల వరకు అధిక మొత్తంలో టెస్టులు, స్కానింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నారని, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలను వ్యతిరేకంగా ఆస్పత్రుల్లో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. అదేవిధంగా పేద ప్రజలు అనారోగ్య పరిస్థితుల్లో డాక్టర్ల వద్దకు వెళితే ముందుగానే టెస్టులు చేయించాలని, స్కానింగ్ తీయించాలని భయపెట్టి వారి వద్ద నుంచి సొమ్మును వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి పర్మిషన్ లేని ఆస్పత్రులను సీజ్ చేయాలని లేనిపక్షంలో భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా మత్తు పదార్థాలకు అడ్డాగా మారిందని, డ్రగ్స్, గంజాయి వంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలు విద్యార్థి, యువకుల జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. వాటిని పోలీసు వ్యవస్థ కొంతవరకు నివారణ చర్యలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో నిలువరించే ప్రక్రియ చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలల కావస్తున్నా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని, పూర్తిస్థాయిలో మెగా డిఎస్‌సి నిర్వహించి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ నాయకులు ఆర్.అరవింద్, పి. వాసు, వై.వేణు, నారాయణరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను చాటిన ట్వింకిల్ కిడ్స్ విద్యార్థులు

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలోని ట్వింకిల్ కిడ్స్ హైస్కూల్ విద్యార్థులు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'భగవంతుడే నిజమైన స్నేహితుడు' అనే వ్యాస రచన పోటీలో జిల్లాస్థాయిలో తమ ప్రతిభను చాటారు. జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్న 9వ తరగతి విద్యార్థిని దన్నాన వైష్ణు కావ్యకు పాఠశాల డైరెక్టర్ దొడ్డి శ్యామ్, కరస్పాండెంట్ చాపాన శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చాపాన ప్రభారాణి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాఠశాల స్థాయిలో తెలుగు వ్యాసరచనకు పి.ఢిల్లీశ్వరి, 10వ తరగతి, ప్రథమ బహుమతి, బి.శ్రీలత, ద్వితీయ బహుమతి, ఎం.సాయితన్మయి, తృతీయ బహుమతి, ఇంగ్లీష్ వ్యాస రచనకు డి.వైష్ణు కావ్య, ప్రథమ బహుమతి, జన్నత్ షా, ద్వితీయ బహుమతి, ఎ.సౌజన్య, తృతీయ బహుమతి అందుకున్నారు. విద్యార్థులకు ట్వింకిల్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బహుమతులు పొందిన విద్యార్థులు

సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ప్రమీల

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకకు చెందిన కంది పారంనాయుడుకు సిఎం సహాయ నిధి రూ.2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అందజేశారు. ఇటీవల క్వారీ ప్రమాదంలో పారం నాయుడు తీవ్రంగా గాయపడడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిఎం సహాయనిధిని మంజూరు చేయించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ఖండాపు శ్రీనివాసరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొంచాడ చిన్నం, స్థానిక నాయకులు పట్నాన పారం నాయుడు, కొంచాడ అప్పల నాయుడు, కొంచాడ మనోహర్, కొంచాడ సన్యాసిరావు, కొంచాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

11న జీడితోట వేలం

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 11న కోడూరు పంచాయతీ పరిధిలోని జీడి తోట ఒక ఏడాది పంటకి వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జీడి తోట ఫలసాయం పొందుటకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన వారు మండల పరిషత్ కార్యాలయం పేరుతో బారతీయ స్టేట్ బ్యాంక్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా లక్ష రూపాయల సాల్వెన్స్ సర్టిఫికెట్, రూ.30 వేలు దరావత్‌గా పాట సమయంలో అందజేయాలన్నారు. అలాగే పాట నిర్వహించిన తరువాత ఖరారైన మొత్తం సొమ్మును సమర్పించాలని, అలా లేనియడల దరావత్, సాల్వెన్స్ సర్టిఫికెట్ మండల పరిషత్ ఖాతాకి జమచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నిబంధనలు తెలుసుకుని వేలం పాటలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఇఒ భద్రాజీ

స్వచ్ఛంద సంస్థల సహకారం భేష్

ప్రజాశక్తి- అరసవల్లి

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు కొనసాగాలని, రథసప్తమి పర్వదినాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించిన తరువాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో జరిగిన వేడుకలకు స్వచ్ఛంద సంస్థల సహకారం వర్ణించలేనిదని అరసవల్లి ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీ గురువారం అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు అమోహమని, లయన్స్ ఇంటర్నేషనల్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకోవటం ఆనందంగా ఉందని జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల నటుకుల మోహన్ ఆధ్వర్యంలో రూ. లక్షా ముప్పైవేల విలువగల జెనరేటర్ అందించారని గుర్తు చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని రవి కుమార్‌కు అందజేశారు. రథసప్తమి వేడుకలు అందరి సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించ గలిగామన్నారు. కార్యక్రమంలో ఇఒతో పాటు లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యులు పొడుగు చరణ్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేష్ తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

కవిటి: మార్చి 14న పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ ప్రచార పోస్టర్‌ను జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ గురువారం కవిటిలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి జన సైనికులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ కె.అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి ఎం.భాస్కరరావు, చీకటి కృష్ణయ్య, ప్రశాంత్ కుమార్, బి.దాలయ్య, పి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, హెల్పర్లు తదితరులు

అంగన్వాడీల ర్యాలీ

నందిగాం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ నెల 8న జరగనున్న కార్యక్రమంలో భాగంగా మండల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, బాలికల తల్లులు ఆధ్వర్యంలో నందిగాం సెక్టార్‌వన్ పరిధిలో ముందస్తుగా మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మహిళలను గౌరవిద్దాం సమాజాన్ని ముందుకు నడుపు తాం అనే నినాదంతో హోరెత్తించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జలజాక్షి, కార్యకర్తలు మల్లేశ్వరి, సుమతి, హిందూమతి, మీరాబాయి తదితరులున్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే జరిమానా

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని మంచినీటి కొళాయిలకు అక్రమంగా మోటార్లను బిగించి నీటి చౌర్యానికి పాల్పడితే అటువంటి వారి కుళాయిలకు డమ్మీలు బిగించి రూ.3 వేలు అపరాధ రుసుం విధించబడునని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురపాలక సంఘంలో వేసవి దృష్ట్యా ప్రజలకు మంచినీటి సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడకుండా వివిధ వార్డుల్లో మెరుగైన మంచినీటి సరఫరా కోసం తాము ప్రయత్నిస్తుంటే పలు వార్డుల్లోని ఇంటి యజమానులు మంచినీటి కుళాయిలకు అక్రమంగా మోటార్లను బిగించి నీటి చౌర్యం చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కొంత మంది నీటి చౌర్యం వలన మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కార్యాలయానికి ఫిర్యాదులు పెద్దఎత్తున అందుతున్నాయని తెలిపారు. పురపాలక సంఘ చట్ట ప్రకారం నీటి చౌర్యం చేపట్టే వారిపై తగు చర్యలు తీసుకోబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆధార్‌తో వైద్య సేవలు పొందండి

ఇచ్ఛాపురం: వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు మండలంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేందర్ రెడ్డి ఆస్పత్రి సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఇకనుంచి ప్రతి ఒక్క పేషంట్ తమ యొక్క ఆధార్ కార్డు తెచ్చి పేషంట్ యొక్క కేస్ స్టడీ వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. దీనివల్ల పేషెంట్ ఆరోగ్య స్థితి ఏ ఆస్పత్రిలోనైనా తెలుసుకొని, సమస్యను సులభంగా గుర్తించి చికిత్స సులభంగా పొందవచ్చునన్నారు. సమావేశంలో డాక్టర్ అనూష, డాక్టర్ శిల్ప, డాక్టర్ బి.గౌతమి, హెడ్ నర్సు, ఐసిటిసి కౌన్సిలర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు మద్యం దుకాణాలు కేటాయించాలి

టెక్కలి: రాష్ట్రంలో ఉన్న గిరిజనులకు కూడా ప్రభుత్వం సబ్సిడీ, రాయితీలపై మద్యం దుకాణాలు కేటాయించాలని ఆదివాసీ పరిషత్ రాష్ట్ర నాయకులు వాబ యోగి గురువారం డిమాండ్ చేశారు. సొంది సామాజిక తరగతి దామాషాపై గిరిజనులకు కూడా అవకాశం కల్పించాలన్నారు. గిరిజనులు కూడా సారా అమ్ముకునే వారిని వారి జీవనోపాధిలో ఒక భాగమని సంబంధిత శాఖాధికారులు రికార్డులు కూడా సృష్టించారని, గిరిజనుల మీద తప్పుడు కేసులు నమోదు చేసి సారా అమ్మకపు దారులుగా చిత్రించిన ఆబ్కారీ శాఖ ప్రభుత్వానికి నివేదించి వారికి కూడా రాయితీపై మద్యం దుకాణాలు కేటాయించాలన్నారు. ఈయనతో పాటు గిరిజన సంఘ నాయకులు జన్ని దాలయ్య, బాలకృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దివీస్ ప్రతినిధులు, అధికారులు

40 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కాశినాధ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. ఈ ఎంపికలకు దివీస్ ల్యాబొరేటరీస్ యాజమాన్యం తరపున మేనేజర్ పూర్ణ చంద్రరావు, సాంబ శివ హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించారు. సుమారు 63 మంది హాజరవ్వగా వారిలో 40 మందికి అవకాశం దక్కిందని ప్రిన్సిపాల్ యన్.వి. వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ డా. గురుబాబు, సుగుణారెడ్డి, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, ప్లేస్మెంట్ ఆఫీసర్ అభినందించారు.

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కిరణ్

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మర్రిపాడు పంచాయతీ చిన్నమర్రిపాడులో వాలీబాల్ టోర్నమెంట్‌ను టెక్కలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా మర్రిపాడులో మూడు రోజుల పాటు ఎల్లమ్మ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్న సాల్ట్ లేబర్ యూనియన్‌ను అభినందించారు. దీనిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల ఆటల పోటీలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో కుమారస్వామి, త్రివేణిరావు, బాలరాజు, వెంకటరమణ, భాస్కర్, గిరి, భీమరావు, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జానపద కళారూపాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

అలరించిన జానపదం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెజ్జిపుట్టుగలో జరుగుతున్న చక్ర పెరుమాళ్ల డోలోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రదర్శించిన జానపద కళా స్రవంతి ఆహుతులను ఆకట్టుకుంది. బార్లవీధి సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో పీత గంగయ్య బృందం తప్పెటగుళ్ళు, తగరపువలసకు చెందిన చిన్నారెడ్డి, పద్మావతి బృందం రైతు సమస్యలపై ప్రదర్శించిన నృత్యం, జానపద రేలా రేలా పాటలు అలరించాయి. ఇక జగన్ – ప్రసాద్ బృందం జముకుల పాట, డప్పు వాయిద్యం, అమ్మ రామకృష్ణ, మనోజ్‌ల జానపదాలు, గిడుగు రామమూర్తి తెలుగు భాష జానపద కళా పీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు జానపదాల సొగసులతో కళా ప్రాంగణం కళకళలాడింది. అనంతరం గ్రామస్తులు గొండ్యాల రామ్మూర్తి, బార్ల జగన్నాథం, బొర్రా నరసింహమూర్తి, బార్ల మోహనరావు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశీకులు పొందల కృష్ణారావు, పొందల రాంబాబు, జానపద కళాకారులు బాలక లోకనాథం, మద్దిలి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సెస్ వసూళ్లకు కృషి చేయాలి

ప్రజాశక్తి- లావేరు

జిల్లాలో ఉన్న శాఖా గ్రంథాలయాల్లో సిబ్బంది గ్రంథాలయ సెస్ వసూలకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అన్నారు. గురువారం లావేరు శాఖా గ్రంథాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ సెస్ వసూలుతో పాటు ధరావత్తుల సంఖ్య పెంచాలన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. రికార్డులను తనిఖీ చేసి గ్రంథాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ గ్రంథాలయంలో చదివి బ్యాంకరు మేనేజర్ ఉద్యోగం వచ్చిన కె.గోవింద్ సుమారు రూ.5 వేలు విలువ గల పోటీ పరీక్ష పుస్తకాలను గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈయనతో పాటు గ్రేడ్‌వన్ గ్రంథాలయాధికారి శంకరరావు, లావేరు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు వీరభద్రుడు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న కుమార్ రాజు

వాకర్స్ శ్రమదానం

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రతీరోజు నడక సాగించే వ్యాయామదారులు మైదానాన్ని శ్రమదానంతో గురువారం శుభ్రపరిచారు. ఇటీవల చిన్నజీయర్ స్వామి కార్యక్రమాన్ని మైదానంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వాహకులు భోజనాలు ఏర్పాటు చేశారు. అయితే వేలాది మంది భోజనాలు చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోయాయి. దీంతో నడకదారులు, యువకులు, వృద్ధులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో దోని కొండలరావు, నగేష్, ఉమా, మూర్తి, శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బాపూజీ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేస్తున్న వాకర్స్

జామి ఎల్లమ్మ జాతరకు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 7న జరగనున్న జామి ఎల్లమ్మ జాతర సందర్భంగా భారీ వాహనాలు రాకపోకలపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హై వే నుంచి ఇచ్ఛాపురంలో ప్రవేశించి వాహనాలు స్కై డ్రాప్ నుంచి ఎఎస్.పేట మీదగా పట్టణంలోకి అనుమతించడం జరుగుతుందని సిఐ మీసాల చిన్నం నాయడు తెలిపారు. అదే విధంగా ఇచ్ఛాపురం పట్టణం నుంచి స్కై డ్రాప్ జంక్షన్ వైపు వెళ్లాల్సిన వాహనాలు. ఎఎస్.పేట సుమండి మీదుగా వెళ్లాలని సూచించారు. జామి ఎల్లమ్మ జాతరకు వచ్చే యాత్రికులు తమ వాహనాలను రాజా వారి గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలని కోరారు. బెల్లుపడ పోవు మార్గంలో ఎటువంటి వాహనాలు పార్కింగ్ చేయరాదని సిఐ తెలిపారు. ఎవరైనా తమ వాహనాలను రహదారికి ఇరువైపుల పార్కింగ్ చేసిన యెడల చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోంపేట : జాతర కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

సోంపేట : పట్టణంలో జామి ఎల్లమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో శుక్రవారం సోంపేట పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సిఐ మంగరాజు తెలిపారు. ఉదయం నుంచి భారీ వాహనాలు, బస్సుల రాకపోకలను సోంపేట పట్టణంలోనికి అనుమతించడం లేదని తెలిపారు. కొర్లాం నుంచి వచ్చే బస్సులు, వాహనాలు బారువ మీదుగా సోంపేట వెళ్లకుండా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే కంచిలి నుంచి వచ్చే వాహనాలు సోంపేట మీదుగా బారువ వైపు వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. కొర్లం జాతీయ రహదారి మీదుగా సోంపేట వెళ్లాల్సిందిగా సూచించారు. అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోంపేట గాంధీ మండపం వైపు నుంచి ద్విచక్ర వాహనాలను సైతం నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. జామి ఎల్లమ్మ జాతర ముగిసేంత వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయని ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని కోరారు. అలాగే డిఎస్‌పి వెంకట అప్పారావు పట్టణంలో పర్యటించి ట్రాఫిక్‌పై సిబ్బందితో పాటు జాతర కమిటీకి పలు సూచనలు చేశారు.

శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్ ఆనందరావు

తడి, పొడి వ్యర్థాలపై శిక్షణ

ప్రజాశక్తి- నందిగాం

తడి, పొడి వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ విధానంపై నందిగామలోనే చెత్త సంపద తయారీ కేంద్రంలో టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. తడి చెత్త నుంచి వర్మీకంపోస్ట్ తయారీ, పొడి చెత్త నుంచి అమ్మకం చేపట్టి ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై డిపిఆర్‌సి రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డిలు యు.రామకృష్ణ, కె.సింహాద్రి, ఇఒ జగన్నాధరావు, కార్యదర్శులు సంతోష్ కుమార్, గోపీనాథ్, లతా జ్యోత్స్న, గ్రీన్ అంబాసిడర్‌లు ఉన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వయసు నుంచే సేవా దృక్పదం అలవర్చుకోవాలన్నారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో–ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, జాతీయ సేవా విభాగం పిఒలు డి.వాసుబాబు, కందిగోళ్ల, రెడ్ రిబ్బన్ కో–ఆర్డినేటర్ సిహెచ్. రాంబాబు, వైద్యాధికారి బి.సునీత, డి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి: సావిత్రీ బాయ్ పూలే వర్ధంతి సందర్భంగా మనువాద పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద కులనిర్మూలనా పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. మనుధర్మ శాస్త్రం చట్టం అమలవుతున్న రోజుల్లో పూలే దంపతులు చేసిన పోరాటాలు నేటి మహిళలకు మార్గదర్శక నీయమని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు అన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, దళిత హక్కుల పరిరక్షణ పోరాట సమితి జిల్లా నాయకులు బైరి ధనరాజ్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, నల్ల రాజు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ పునరుద్ధరణ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో ఏడాదిన్నర కాలంగా మూలన పడ్డ మినరల్ వాటర్ ప్లాంటును వేసవిని దృష్టిలో ఉంచుకుని పునరుద్ధరించారు. మార్కెట్‌లోని రామ మందిరంలో ఆవరణలో ఉన్న ఈ ప్లాంటును మార్కెట్ అధ్యక్షులు కోరాడ హరిగోపాల్ ప్రారంభించారు. అలాగే వేసవిలో మార్కెట్‌కు వచ్చే వినియోగ దారులు, తోపుడుబళ్ల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, కారణా వ్యాపారుల అవసరానికి వీలుగా తాగునీరు అందించేందుకు మార్కెట్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వర్తకులు ఊణ్ణ రమేష్, కోరాడ అశోక్ (బాబి), బరాటం శేఖర్, శిల్లామణి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల మధ్య ఉన్న బోరు

నిరుపయోగంగా బోరు

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ బస్‌షెల్టర్ వద్ద బోరు నిరుపయోగంగా మారింది. మరమ్మతులు లేక కొన్ని నెలలుగా పిచ్చి మొక్కల మధ్య నిరుపయోగంగా కనబడుతుంది. బోరు మరమ్మతులు చేపడితే స్థానికులకు, రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎంతో ఉపయోగ పడుతుందని, అధికారులు దృష్టి సారించి బోరు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

చదువుతోనే ఉన్నత శిఖరాలు

ఆమదాలవలస: ఉన్నతంగా చదివి విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 – 25 ఏడాదికి చెందిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల సభ పాఠశాలలో హెచ్‌ఎం వై.పోలినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుని పై చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పలు సినీ గీతాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.రాజేంద్రప్రసాద్, సర్పంచ్ తమ్మినేని వాణి, తమ్మినేని చంద్రశేఖర్, పాఠశాల స్వర్ణోత్సవ కమిటీ సెక్రటరీ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో–ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. గురువారం మండలంలోని కోర్లకోటలో ఉపాధిహామీ కూలీలకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ నంబర్, బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. అలాగే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ కోసం వివరించారు. నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టి జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.హరినాథ్, లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సి సువ్వారి రవిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గురుగుబెల్లి లత, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న రవిబాబు

మండుతున్న ఎండలు

ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడి ప్రతాపం

కోటబొమ్మాళి: ఎండలు మండుతున్నాయి. వేసవి ప్రారంభం నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఇప్పుడే ఇలా ఉంటే నడి వేసవిలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయ పడుతున్నారు. గ్రామాల్లో ఉదయం వేళ దట్టంగా పొగమంచు కురుస్తుంది. 9 గంటల నుంచి ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతుంది. కొద్ది రోజులుగా 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతుండగా బుధ, గురువారాల్లో 38 డిగ్రీలు నమోదైంది. రానున్న రాజుల్లో వేడి ఎక్కువగా ఉంటుందని ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ రెవెన్యూ విభాగం తెలిపింది. ఈ నెలాఖరు నుంచి ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావారణశాఖ తెలిపింది. ఎండతో మధ్యాహ్నానికి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు వేసవిలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, చిన్నారులు వీలైనంత వరకు ఇంటిపట్టునే ఉండాలన్నారు.

ఎండకు నిర్మానుష్యంగా మారిన మెయిన్‌రోడ్డు

సీనియార్టీ జాబితాలో తప్పులను సరిచేయాలి

వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా విద్యాశాఖ పరిధిలో ఉన్న వెబ్‌సైట్‌లో పొందుపరచిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో తప్పులను సరి చేయాలని డిఇఒ ఎస్.తిరుమల చైతన్యను ఎస్‌టియు నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 2008 డిఎస్‌సిలో ఎంపికైన దాదాపు 1500 మంది సెకండ్రీ గ్రేడ్ టీచర్లు 2010 నుంచి 2019 జనవరి 9 వరకు విడతల వారీగా విధుల్లో చేరారని, వీరిలో కొందరికి 2010లోనే నోషనల్ సీనియారిటీ ఇచ్చారని, వీరితో కలుపుకుని 2010 నవంబరులో చేరిన వారికి సీనియారిటీ జాబితాలో చేర్చాలని కోరారు. తప్పులను సరిదిద్ది సీనియారిటీ జాబితా ఇవ్వాలన్నారు. డిఇఒను కలిసిన వారిలో ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ, కె.శ్రీనివాసరావు, చింతల రామారావు, ఎన్.లక్ష్మణరావు, ఎం.తేజ, జి.శ్రీను, డివిఎన్, హరి, సిహెచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం గ్రామానికి చెందిన మహదాసు మోహనరావు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న రణస్థలం హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు గురువారం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రణస్థలం హెల్పింగ్ హాండ్స్ సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ లాస ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి.వి.ఎస్.భరద్వాజ్ సూచనలు, సలహాలు పాటిస్తూ సంఘం ద్వారా ఎటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన వివరించిన విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా సంఘం ఏర్పాటు చేసిన అనతికాలంలోనే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో రణస్థలం హెల్పింగ్ హాండ్స్ సేవా సంఘం, లాస ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు, రణస్థలం గ్రామస్తులు పాల్గొన్నారు.

మోహనరావుకు ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

అనురాగ నిలయంలో అన్నవితరణ

ప్రజాశక్తి- అరసవల్లి

వృద్ధులు, పిల్లల మధ్య తన కుమారుడు ప్రేమ్ వర్ధన్ నాయుడు జన్మదిన వేడుకలు జరుపుకోవటం ఆనందంగా ఉందని సంతకవిటి మండలం, వాల్తేరు గ్రామానికి చెందిన గురుగుబెల్లి స్వామినాయుడు, పావని దంపతులు గురువారం అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో ఉన్న చిన్నారులకు, సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో ఉన్న వృద్ధులకు అన్న వితరణతో పాటు, తినుబండారాలు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రిని అందించారు. అనంతరం రెడ్‌క్రాస్ చైర్మన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందించారు. స్వామి నాయుడు ఆలోచనకు, చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపాన నారాయణరావు, పొన్నాడ సుని, అనురాగ నిలయ నిర్వాహకులు దుర్గా శ్రీనివాసరావు, లలిత, ఆశ, సాయి సుధాకర్, వృద్ధులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జగన్మోహనరావు

ఐటిడిఎ ఏర్పాటుకు సహకరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటుకు సహకరించాలని జిల్లాకు చెందిన గిరిజనులు పియుసి చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కోరారు. గురువారం అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల గిరిజన నాయకులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఐటిడిఎ ఏర్పాటు కోసం ఇప్పటికే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లానని, అలాగే అసెంబ్లీలో కూడా గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి దృష్టికి గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తీసుకువెళ్లి ప్రశ్నించడం కూడా జరిగిందని గిరిజనులకు రవికుమార్ తెలిపారు. తొందరలోనే జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని మంత్రి వివరణ ఇచ్చారని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

పత్రికను ఆవిష్కరిస్తున్న సిఐ, ఎస్‌ఐ తదితరులు

పత్రికలు సమాజానికి ప్రతిబింబాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

పత్రికలు సమాజానికి ప్రతిబింబాలని, ఆధునిక సమాజపు పోకడలకు అద్దం పడతాయని సిఐ జె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన కళాశాల అంతర్గత పత్రిక 'జయహో'ను ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థుల ఔత్సాహ్యానికి వారి ఆసక్తికి ప్రతీక ఈ పత్రిక అని కొనియాడారు. విద్యార్థుల్లో ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసే ఈ ప్రయత్నం గొప్పదని కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఎస్‌ఐ సిహెచ్ దుర్గాప్రసాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ కార్యకలాపాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు వై.రాంబాబు, పి.వి.రమణ, జీవన్, డి. వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

గర్భాశయ కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ బి.సందీప్ అన్నారు. నగరంలోని రైతుబజారు వద్దగల మెప్మా భవనంలో భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ సాధారణ పాప్ టెస్ట్‌లు గర్భాశయ ముందస్తు సమస్యలను గుర్తించవచ్చుని, గర్భాశయ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి నివారించడానికి 21 ఏళ్లు దాటిన ప్రతి మహిళ సాధారణ పాప్ పరీక్షలు ఏడాదికోసారి తప్పక చేయించుకోవాలన్నారు. అలాగే హెచ్‌పివి 17 ఏళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షులు మణిశర్మ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షులు వావిలాపల్లి జగన్నాథంనాయుడు, వైద్యులు సిహెచ్.మౌనిక, షేక్ మహరాజ్, గైనికాలజిస్ట్ డాక్టర్ పద్మావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య, నర్మజ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డబ్బా పక్కన ఉన్న చెత్త

పడకేసిన పారిశుధ్యం

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి- అరసవల్లి

ఇందిరానగర్ కాలనీలో చెత్తకోసం ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ నిరుపయోగంగా మారింది. మున్సిపల్ సిబ్బంది చెత్తను బయటపడవేసి వారానికి ఒకసారి నిప్పు పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సోమశేఖర్

ఊబకాయంతో ఆరోగ్యానికి ముప్పు

శ్రీకాకుళం అర్బన్ : ఊబకాయం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావడమే కాకుండా ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి రావచ్చని చిన్న పిల్లల వైద్య నిపుణులు సీపాన సోమశేఖర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో స్టార్ వాకర్సు ఆధ్వర్యాన ఊబకాయంపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. సమయపాలన లేని భోజనం, నిద్ర లేమి, వ్యాయామం లేకపోవడమే ఊబకాయానికి కారణమన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్సు వ్యవస్థాపక అధ్యక్షులు గేదెల ఇందిరా ప్రసాద్, డాక్టర్ టి.చంద్రశేఖర్, పి.జి గుప్తా, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహావిష్కరణ

పొందూరు: మండలంలోని తాడివలస పంచాయతీ పరిధిలోని లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద విగ్రహాన్ని సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ఎంపిటిసి సువ్వారి దివ్య ఆవిష్కరించారు. తాడివలసకు చెందిన విశ్రాంత లెక్చరర్ మెట్ట అన్నాజీ భట్లు వితరణగా ఈ విగ్రహాన్ని అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం గండెం రామారావు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పైడి ప్రసాద్, తాడివలస ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బల్ల కంటయ్య, గ్రామ పెద్దలు దానేటి సత్యం, సర్పంచ్ ప్రతినిధి జగన్నాధరావు నాయుడు, సనపల సత్యకుమార్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసన్న, తాడివలస ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తదితరులు